మాల సంఘం నాయకుల నిరసన

నిరసన తెలుపుతున్న మాల సంక్షేమం సంఘం నాయకులు

బోథ్, ఫిబ్రవరి 14 : తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల పర్యటించిన షమీం అక్తర్ ఏక సభ్య కమిషన్ రిపోర్ట్‌ను వ్యతిరేకిస్తూ శుక్రవారం బోథ్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలుపుతూ ఈ నెల 4న సోషల్ జస్టిస్ డేగా నిర్ణయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు ఎలుక రాజు, ఉపాధ్యక్షుడు బూర్గుల సందీప్ కుమార్, కోశాధికారి లక్ష్మణ్, ఊశన్న, రాములు, సురేందర్, ఆకుల రాజు, ఆకుల సురేశ్, కన్గుట్ట గ్రామ అధ్యక్షుడు కొటాడి స్వామి, కుచలాపూర్ గ్రామ అధ్యక్షుడు లక్ష్మణ్, భూమేశ్, రమేశ్, గంగయ్య, మల్లేశ్, గంగాధర్, ప్రసాద్, బాపు పాల్గొన్నారు.

కుల గణనపై ఆగ్రహం

బోథ్, ఫిబ్రవరి 14: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కులగణన సర్వేలో మున్నూరు కాపులను తక్కువగా చేసి చూపెట్టడంపై బోథ్ మున్నూరు కాపు సంఘం కార్యవర్గ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం బోథ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. గతంలో రాష్ట్రంలో 18 శాతంగా ఉన్న మున్నూరు కాపులను నేడు తగ్గించి చూపెట్టారన్నారు. రాష్ట్రంలో పలు కులాలను పెంచుతూ చూపెట్టిన ప్రభుత్వం, మున్నూరు కాపులు ఎందుకు తగ్గించిందని ప్రశ్నించారు. త్వరలోనే హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు శివా రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోనగిరి కార్తీక్, ఉపాధ్యక్షుడు మహేందర్, కోశాధికారి బారె గోవర్ధన్, సభ్యులు భూమేశ్, కుమ్మరి పోతా రెడ్డి, అల్లకొండ పోతన్న, సోమ శంకర్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదు

ఖానాపూర్, ఫిబ్రవరి 14: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని ప్రధాన కూడళ్లు, బస్టాండు, రహదారి పక్కన, బహిరంగ ప్రదేశాల్లో అనుమతి లేకుండా ఎలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పండుగలు, ప్రారంభోత్సవాలు, రాజకీయ నాయకుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 14 : నిర్మల్, ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న నిర్మల్ జిల్లా ఆదర్శనగర్‌కు చెందిన నలుగురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిజామాబాద్‌లోని పోలీస్ కమిషనరేట్‌లో ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. డిచ్‌పల్లి ఎస్ఐ మహ్మద్ షరీఫ్.. సిబ్బందితో కలిసి డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై గంజాయి తరలిస్తున్న జాదవ్ వంశీకృష్ణ, ఆకోజి అభిలాష్‌తో పాటు మరో ఇద్దరు తుకారాం రాథోడ్, తాళ్ల ప్రమోద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మొత్తం 900 గ్రాముల గంజాయి, 4 సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను సీజ్ చేసి, డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్ఐ మహ్మద్ షరీఫ్‌తోపాటు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

అస్తవ్యస్తంగా ఎంబీలు, కూలీల హాజరు పట్టికలు

గాదిగూడ ఈజీఎస్ కార్యాలయంలో అస్తవ్యస్తంగా పడేసిన ఎంబీలు

ఆదిలాబాద్ జిల్లా గాదిగూడలోని ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో మస్టర్‌రోల్, ఎంబీ రికార్డు పుస్తకాలు అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. వీటిని చూస్తేనే అధికారుల పనితీరు ఎలా ఉందో చెప్పనక్కరలేదు. సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతోనే మండల స్థాయి శాఖ అధికారుల చలనం కనిపించడం లేదని చెప్పాడానికి ఇదే నిదర్శనం. -నార్నూర్, ఫిబ్రవరి 14

నర్సరీలను కాపాడాలి

కుంటాల, ఫిబ్రవరి 14 : నర్సరీలను మొక్కలను సంరక్షించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సిబ్బందికి సూచించారు. కుంటాల మండలంలోని ఆయా గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. అనంతరం కుంటాల మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి, ఐకేపీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉపాధి కూలీలకు పనులు కల్పించడం, గ్రామ నర్సరీ, రికార్డుల నిర్వహణ గురించి సమీక్షించారు. సమావేశంలో ఏపీవో నవీన్, ఏపీఎం అశోక్ పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా...

గాదిగూడ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పడేసి ఉన్న రాగిజావ ప్యాకెట్లకు పట్టిన చీమలు

నార్నూర్, ఫిబ్రవరి 14 : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాగి జావ ప్యాకెట్లను పంపిణీ చేసింది. పాఠశాలలోని విద్యార్థులకు జావ అందించాల్సి ఉంటుంది. కాగా ఎమ్మార్సీ కార్యాలయం అధికారి నిర్లక్ష్యంతో స్థలం లేదంటూ గాదిగూడ ఎంపీడీవో కార్యాలయంలో బయటపెట్టారు. పలు రాగిజావ ప్యాకెట్లు అస్తవ్యస్తంగా పడి ఉండడంతో వాటికి చీమలు పట్టుకున్నాయి. ఈ విషయం వివరణ కొరకు గాదిగూడ ఎంఈవో మనోహర్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు. కార్యాలయానికి వచ్చే ప్రజలు విద్యాశాఖ అధికారుల పనితీరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎంఈవో స్పందించి రాగి జావ ప్యాకెట్లను పంపిణీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అమరుల త్యాగాలను స్మరించుకోవాలి



ఎదులాపురం: అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, పార్టీ నాయకులు

ఎదులాపురం, ఫిబ్రవరి 14 :దేశ రక్షణలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి జోగు రామన్న అన్నారు. పుల్వామా దాడిలో అమరులైన సైనికులకు బీఆర్ఎస్ పార్టీ, సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయం ఎదుటనున్న కార్గిల్ పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద అమర జవాన్లకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అజయ్, నారాయణ, సాజీదుద్దీన్, పండ్ల శ్రీను, మెట్టు ప్రహ్లాద్, నర్సింగ్, దాసరి రమేశ్, ధమ్మపాల్, శివకుమార్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, సైనికుల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు శంకర్‌దాస్, కెప్టెన్ మజారుద్దీన్, రాజు, రవీందర్, లక్ష్మణ్, రాజు, సంతోష్, నర్సింగ్ పాల్గొన్నారు.

కుంటాల, ఫిబ్రవరి 14 : జమ్ముకశ్మీర్‌లోని పుల్వామా దాడిలో వీరమరణం పొందిన సైనికులను జ్ఞాపకం చేసుకుంటూ శుక్రవారం శాంతినికేతన్ విద్యానిలయంలో నివాళులర్పించారు. విద్యార్థులు సైనిక వేషధారణలో తయారై ఆనాటి సంఘటనను గుర్తు చేసుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్, ఫిబ్రవరి 14: జమ్ముకశ్మీర్‌లోని పుల్వామా దాడిలో వీరమరణం పొందిన సైనికులను నవ నిర్మాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సొనాల గ్రామ యువకులు కొవ్వొత్తుల నివాళులర్పించారు. వారి త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్, ఫిబ్రవరి 14: పుల్వామా ఉగ్రదాడిలో అసువుల బాసిన వీర జవానులకు ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ లోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కోఆర్డినేటర్ శ్రావణి,విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

తలమడుగు: పల్లి(కే) గ్రామంలో పర్యటిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

తలమడుగు, ఫిబ్రవరి 14: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని పల్లి(కే) గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామస్తులు డప్పు వాయిద్యాలు, మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలోని శబరి ఆశ్రమాన్ని నాయకులతో కలిసి దర్శించుకున్నారు. గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం సవారీ బంగ్లాను దర్శించుకున్నారు. గ్రామాభివృద్ధి నిధులతో చేపట్టే హస్సేన్ హుస్సేన్ నిర్మాణానికి గ్రామస్తులతో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఖోడద్ గ్రామానికి చెందిన పన్నాల కిష్టన్న. గంగారెడ్డి ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జొన్నల కేంద్రం ఏర్పాటు చేయాలి

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 14: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లో జొన్నల కేంద్రం ఏర్పాటు చేయాలని శుక్రవారం నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను బజార్‌హత్నూర్ రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు డుబ్బుల చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లోని రైతులు పండించిన జొన్న పంటను ఇచ్చోడకు తీసుకెళ్లి మార్కెట్ యార్డులో అమ్ముకోవాలంటే వారికి దూరభారంతో పాటు ప్రయాణ ఖర్చులు అధికమవుతున్నాయన్నారు. పంటను అమ్ముకునే వరకు మార్కెట్‌లో నిరీక్షణ తప్పదని పేర్కొన్నారు. కావున బజార్‌హత్నూర్‌లోనే జొన్నల మార్కెట్ సబ్‌సెంటర్‌ను ఏర్పాటు చేసి రైతుల కష్టాలను గట్టెకించాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మార్క్‌ఫెడ్ డీఎంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఇక్కడ రైతులు, యువకులు లింగన్న, సురేశ్, సుకుమార్ ఉన్నారు.

ఈద్గా అభివృద్ధికి సహకరించాలి

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 14: రంజాన్ పండుగ వస్తున్న సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లోని ఈద్గా అభివృద్ధికి సహకరించాలని మండల జామ మసీద్ కమిటీ సభ్యులు శుక్రవారం నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను మార్యదపూర్వకరంగా శాలువాతో సన్మానించి వినతిపత్రం అందజేశారు. వారి వెంట కమిటీ సదర్, మజార్ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

కుభీర్, ఫిబ్రవరి 14: నిర్మల్ జిల్లా కుభీర్0 మండలంలోని బెల్గాంతండా–2కు చెందిన జాదవ్ రోహిదాస్(30) గురువారం రాత్రి తన చేనులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. రోహిదాస్ ప్రైవేటు టీచర్. ఆయనకు ఇటీవల పెళ్లి సంబంధం కుదిరింది. కాగా ఈపెళ్లి ఇష్టం లేక తేదీ సమీపిస్తుండడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సులో బ్యాగు పోగొట్టుకున్న యువతి

ఇచ్చోడ, ఫిబ్రవరి 14: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న ఓ యువతి బస్సులో బ్యాగు పోగొట్టుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సుభాష్ నగర్‌కాలనీకి చెందని కేంద్రే కేరబాయి తన తల్లి గాయబాయి, వదిన లలితతో కలిసి ఆదిలాబాద్‌లో ఉన్న కేంద్రే రాజేశ్వర్ ఇంటికి మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులో వెళ్లారు. ఆదిలాబాద్‌కు వెళ్లి చూడగా కేంద్రే కేరా బ్యాగులోని పర్సులో చూడగా రూ.50 వేలు మాయమైనట్లు గుర్తించింది. వెంటనే ఇచ్చోడలో పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసింది. రూ.50 వేలు పోగొట్టుకోవడంతో బాధితురాలు లాబోదిబో ముంటుంది. దొరికిన వారు పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని కోరారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

ఇచ్చోడ: ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

ఇచ్చోడ, ఫిబ్రవరి 14 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముక్రా(బీ) గ్రామంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను కోరగా ఆరు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించారు. శుక్రవారం గ్రామస్తులు ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారుతి, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

బోథ్, ఫిబ్రవరి 14 : ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో శుక్రవారం రాత్రి హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. మూడు చోట్ల హైమాస్ట్ లైట్లు అవసరమని ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు స్థానిక బీఆర్ఎస్ నాయకులతోపాటు ఆయా కాలనీవాసులు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే అందుకు అవసరమైన నిధులు మంజూరు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండలాధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ శాఖాధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, వెంకట రమణ గౌడ్, ప్రవీణ్, రఫీ, రాకేశ్, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం నిర్మాణంలో నాణ్యతను పాటించాలి

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 14: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం మర్కాగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని బుర్సన్‌పటార్, నవగూడ గ్రామాల శివారులో చేపడుతున్న చెక్‌డ్యాం నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలని డీఆర్డీవో రాథోడ్ రవీందర్ అన్నారు. శుక్రవారం చెక్‌డ్యాం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈజీఎస్ ద్వారా చేపడుతున్న చెక్‌డ్యాం నిర్మాణ పనులను అటవీ శాఖ అధికారుల నిలిపివేయవద్దని అధికారులకు సుచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టీఏ జాదవ్ మహేందర్, అటవీ శాఖ అధికారులు రాజేందర్, అరుణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

GOLD FINANCE

★మీ బంగారం మణప్పరం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.

NT-337308

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆదిలాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677

భైంసా చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

పట్టుకున్న ద్విచక్రవాహనాలతో పోలీసులు

భైంసా, ఫిబ్రవరి 14 : నిర్మల్ జిల్లా భైంసాలోని పలు కాలనీల్లో బైక్ దొంగతనాలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ గోపీనాథ్ తెలిపారు. శుక్రవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా వీరిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వివరాలకు వెళ్లితే.. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మేకల్ వార్ సాయినాథ్ అతని స్నేహితులైన అనిల్, సురేశ్‌తో కలిసి జనవరి 22వ తేదీన భైంసాలోని పంజేషా మజీద్ సమీపంలోని ఓ ఇంటి ముందు నుంచి పక్కనే ఉన్న మరో గల్లీలో మరో బైక్ చోరీ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాస్, ఐడీ పార్టీ సిబ్బంది, హెడ్‌కానిస్టేబుల్ అనిల్, పీసీ ప్రమోద్‌ను ఎస్పీ జానకీషర్మిల అభినందించినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్: మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

ఉట్నూర్, ఫిబ్రవరి 14: ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పైలెట్ ప్రాజెక్ట్ ప్రజావాణి, ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రంలో ఫిర్యాదుల బహిరంగ విచారణ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కారం దిశగా అధికారులు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జైనథ్, ఫిబ్రవరి 14: ప్రజా సమస్యలను సత్వర పరిష్కరించేందుకు పైలెట్ ప్రాజెక్టు ప్రజావాణి కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఆర్డీవో వినోద్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లోని రైతు సంఘ భవనంలో పైలెట్ ప్రాజెక్ట్ ప్రజావాణి, ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రంలో ఫిర్యాదుల బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ కేంద్రాల్లో మొత్తం 52 మంది లబ్ధిదారులు తమ సమస్యలు పరిష్కరించేందుకు దరఖాస్తులు సమర్పించారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు ఆయా శాఖ అధికారులు వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి భాస్కర్ నాయక్, తహసీల్దార్ ఆత్రం నారాయణ, భోరజ్ తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, సాత్నాల తహసీల్దార్ విశ్వనాథ్ ఎంపీడీవో శ్యాం సుందర్, భోరజ్ ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

బేల, ఫిబ్రవరి 14: ఆదిలాబాద్ జిల్లా బేలలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో పైలెట్ ప్రాజెక్ట్ ప్రజావాణి, ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రంలో ఫిర్యాదుల బహిరంగ విచారణనిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి మనోహర్‌రావ్ దరఖాస్తుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడించి, 25 దరఖాస్తుల్లో 4 దరఖాస్తులపై సత్వర పరిష్కారం చేశారు. మిగతా దరఖాస్తులు ప్రభుత్వం నుంచి ఆన్‌లైన్ సమస్య, మంజూరు సమస్యలతో ఆయా శాఖల్లో పెండింగ్‌లో ఉన్నాయి. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్ కుమార్, తహసీల్దార్ రఘునాథరావ్, ఏవో సాయితేజ రెడ్డి, ఏఈలు శాంతికుమార్, హరీశ్, ఏఈవోలు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చోడ, ఫిబ్రవరి 14 : మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభించినట్లు ఆదిలాబాద్ జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని రైతు వేదికలో పైలెట్ ప్రాజెక్ట్ ప్రజావాణి, ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రంలో ఫిర్యాదుల బహిరంగ విచారణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్, ఏవో కైలాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బోథ్ వీడీసీ కమిటీ రద్దు

బోథ్, ఫిబ్రవరి 14 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ గ్రామాభివృద్ధి కమిటీ కాలపరమితి ముగియడంతో శుక్రవారం కమిటీని రద్దు చేస్తున్నట్లు అధ్యక్షుడు గంగాధర్ ఒక ప్రకటనను విడుదల చేశారు. త్వరలోనే హడ్‌హక్ కమిటీతో పాటు నూతన కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మంచికుంట సతీశ్, కట్ట భూమేశ్, దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాల తనిఖీ

బోథ్, ఫిబ్రవరి 14 : ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాల, వాగ్దేవి జూనియర్ కళాశాలల్లో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను శుక్రవారం జిల్లా మాధ్యమిక విద్యాధికారి రవీందర్ తనిఖీ చేశారు. పరీక్షల తీరును అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కేంద్రాల ఇన్‌చార్జిలను ఆదేశించారు.

ఏకపక్ష నిర్ణయం సరికాదు

ఎదులాపురం, ఫిబ్రవరి 14: ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయం సరికాదని మాల, మహార్, నేతకాని కులస్థులు పేర్కొన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడారు. మందకృష్ణ మాదిగ, మాజీ ఎంపీ నేతకాని వెంకటేశ్ తీరును ఖండించారు. ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదికలో చాలా అభ్యంతరాలు ఉన్నాయని నాయకుడు ప్రజ్ఞకుమార్ పేర్కొన్నారు. నేతలు కొప్పుల రమేశ్, రాఘవేందర్ పాల్గొన్నారు.

కుంభమేళాకు వెళ్లివస్తూ ఒకరి మృతి

నేరడిగొండ, ఫిబ్రవరి 14 : కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో రాజేశ్(42) మృతి చెందినట్లు నేరడిగొండ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..తమిళనాడుకు చెందిన రాజేశ్ బైక్‌పై కుంభమేళాకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నేరడిగొండ మండలంలోని లింగట్ల బస్‌స్టాప్ సమీపంలో శుక్రవారం బైక్ వెనుక టైర్ పగిలింది. దీంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. రాజేశ్‌కు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడే వారికే అవకాశం కల్పించండి

మాట్లాడుతున్న తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 14 : ఈ నెల 27వ తేదీన జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్పొరేట్ శక్తులను ఓడించాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. నిర్మల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాసనమండలి ఎన్నికల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రైవేట్ వ్యాపారులు డబ్బులతో ప్రలోభాలు పెట్టి గెలవాలని ఆశపడుతున్నారని అటువంటి వారిని చిత్తుగా ఓడించాలన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడే వారిని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే వారిని గెలిపించాలన్నారు. 30 ఏళ్లుగా మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉపాధ్యాయ సంఘాలలో పని చేస్తూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల సాధనకు తను కృషి చేశానన్నారు. ఉపాధ్యాయ, అధ్యాపకులు ఈ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

పాఠశాలలో వసతులు కల్పించాలి

నిర్మల్ చైన్‌గేట్/ఎదులాపురం, ఫిబ్రవరి, 14: సమగ్ర శిక్